క్లుప్తంగా

ఓటరు స్లిప్‌ల పంపిణీ



పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలల్లో బూత్ లెవల్ అధికారుల ఆధ్వర్యంలో ఓటరు స్లిప్‌ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. శనివారం పాన్‌గల్, కొత్తపేట, దావాత్‌ఖాన్‌పల్లి గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ స్లిప్‌లను ఓటర్లకు అందజేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని వారు సూచించారు. ఓటర్ స్లిప్‌లను ప్రతి ఓటరుకు అందించాలని జిల్లా అధికారులు సూచించడంతో దానికి అనుగుణంగా బూత్‌లెవల్ అధికారులు ఆయా స్లిప్‌లను పకడ్బందీగా పంపిణీ చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌కు చెందిన వంగలి చిన్నబాలస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శనివారం మండల కాంగ్రెస్ నాయకులు సురభి పుల్లారావు పరామర్శించి 50కేజీల బియ్యం, రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. దీంతో పాటు గ్రామానికి చెందిన రాజుగౌడ్, ప్రసాద్‌గౌడ్ ఒక్కొక్కరు 25కేజీల బియ్యం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాణి, మాజీ ఉప సర్పంచ్ మల్లేష్, కాంగ్రెస్ నాయకులు దశరథం, లక్ష్మీనారాయణ, ఎల్లయ్య, కృష్ణ, బాల్‌రాం, బాలకృష్ణ, వెంకటేష్‌గౌడ్, గురుకుమార్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో కొత్త బోర్ మోటార్‌ను శనివారం కౌన్సిలర్ బండారు కృష్ణ ప్రారంభించారు. వేసవిలో భానుడి భగభగకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల దాహార్తి తీర్చేందుకు బోరును ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు వార్డు ప్రజలు కౌన్సిలర్ బండారు కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది కృష్ణమోహన్, పాపిశెట్టి శ్రీనివాసులు, కొండ రాము, ఆవుల భరత్, మన్యం, మున్నూరు సురేందర్, బండారు రాజు, మోహన్ చారి, సయ్యద్ ఇంతియాజ్, కొండ కిషోర్, కొండ మహేష్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్'కు ప్రభుత్వ సంస్థల ధారాదత్తం



అమరచింత: ప్రజల్లో మత చిచ్చు రగిలిస్తూ లబ్ధి పొందాలని చూస్తున్న మతోన్మాద బీజేపీని ఓడించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సీహెంచ్ రాంచందర్ అన్నారు. మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో శనివారం మాస్‌లైన్ పార్టీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని సంపదను కార్పొరేట్ శక్తులకు దారపోయడమే బీజేపీ లక్ష్యమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసిందని కార్మిక వర్గానికి ఉపయోగ పడే చట్టాలను రద్దు చేస్తు పెట్టుబడిదారులకు అందలం వేసిన కేంద్ర ప్రభుత్వంపై కార్మిక లోకం తిరగబడే రోజు ఆసన్నమైందన్నారు. దేశం నడిబొడ్డులో రైతులు తమ హక్కుల కోసం ఏళ్ల తరబడి ఆందోళనలు చేస్తుంటే రైతులను ఆదుకోవాల్సిన బీజేపీ ప్రభుత్వం, వారిపై పోలీసులతో దాడులు చేయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దేశాన్ని మతం పేరిట ప్రజలలో అంతర్గత కలహాలు కలిగిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేసి బీజేపీని గద్దెదించాలని కోరారు. సమావేశంలో నందిమళ్ల ఎంపీటీసీ, జిల్లా కార్యదర్శి హనుమంతు, డివిజన్ కార్యదర్శి ప్రసాద్, మండల కార్యదర్శి రాజన్న, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బుక్‌లెట్ విడుదల

కొల్లాపూర్: బీజేపీ బందీఖానా నుంచి దేశాన్ని విముక్తి చేయాలని సీపీఎం రూపొందించిన బుక్‌లెట్ కాపీలను శనివారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ , సలీం, తారాసింగ్, సురేందర్ తదితరులున్నారు.

పని ఒత్తిడిలో అంగన్‌వాడీలు

- ఏకకాలంలో ఆన్‌లైన్ సర్వే, ఓటర్ స్లిప్‌ల పంపిణీ
- సెంటర్ల నిర్వహణ బాధ్యత
- సకాలంలో అందని జీతాలు



పసిపిల్లలకు వడ్డిస్తున్న పుర్గర్‌చర్ల అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి



వీపనగండ్లలో ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వీపనగండ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలకలకు పోషకాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, హెల్పర్లకు మాత్రం శ్రమకు తగిన వేతనం లభించక చాలీచాలని జీవితాలను వెళ్లదీస్తూ కాలం గడుపుతున్నారు.

ఓటర్ స్లిప్‌ల పంపిణీ

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన 29 పోలింగ్ కేంద్రాల్లో 23, 938 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు బీఎల్‌ఓలుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లే ఇంటింటికీ వెళ్లి ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తున్నారు. దీంతోపాటు పోస్టల్‌బ్యాలెట్ల కోసం వృద్ధులను గుర్తించడం, డబుల్ ఓటర్ల గుర్తింపు, చనిపోయిన వివరాల నమోదు తదితర పనులను అప్పగించారు.

ఏకకాలంలో మూడు రకాల విధులు

సమగ్ర శిశు అభివృద్ధి సేవలు, కుటుంబ వివరాల కోసం ఇంటింటికీ తిరిగి అంగన్‌వాడీ టీచర్లు ఆన్‌లైన్ సర్వే నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. ఈ సర్వే ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు, దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల వివరాలను నమోదు చేసుకునేందుకు ఇంటింటికీ తిరిగి ఆధార్ నెంబర్లను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి. దీనికి అదనంగా ఆరేళ్ల లోపు పిల్లల వివరాలు కూడా సేకరించాలి.

వంట పనితో పాటు కేంద్రాల నిర్వహణ

మండలంలోని 30 అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న హెల్పర్లు సెలవులపై వెళ్లడంతో అంగన్‌వాడీ టీచర్లే పిల్లలను తీసుకురావడం, వంట చేయడం, రికార్డులో వారి వివరాలు నమోదు చేయడం లాంటి పనులు చేస్తున్నారు. ఎండల తీవ్రత కారణంగా మే నెలలోనైనా కేంద్రాలకు సెలవు ప్రకటించాలని ఆందోళన చేసిన అంగన్‌వాడీ టీచర్లకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. పనిభారం, మానసిక ఒత్తిడిని తట్టుకోలేని ఇద్దరు అంగన్‌వాడీ టీచర్లు తమ పదవులకు రాజీనామా చేశారు. వారి విధులను ఇతర గ్రామాల టీచర్లకు అప్పగించడంతో తీవ్ర పని ఒత్తిడితో అంగన్‌వాడీ టీచర్లు పనిచేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కేంద్రాలకు అవసరమైన విద్యుత్, మూత్రశాలలో, శాశ్వత భవనాలు తదితర వసతులను కల్పించాలని అంగన్‌వాడీ టీచర్లు కోరుతున్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి



అంగన్‌వాడీ టీచర్లు రాజీనామా చేయడంతో ఇతర గ్రామ అంగన్‌వాడీ కేంద్ర నిర్వహణ బాధ్యతలు చేపట్టడం ఇబ్బందిగా ఉంది. ప్రస్తుతం ఉన్న ఒత్తిడిలో రెండు కేంద్రాల వివరాలు నమోదు చేయడం సాధ్యం కావడం లేదు. ఆన్‌లైన్ నమోదుకు ఉపయోగపడే ఫోన్లు అందుబాటులో లేవు. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ అయిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

– చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్, రంగవరం

పని భారం తగ్గించాలి



అంగన్‌వాడీ టీచర్లుగా పనిచేస్తూనే బీఎల్‌ఓలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నాం. దీనికి తోడు గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల్లో తమవంతు పాత్రను నిర్వహిస్తున్నాం. గ్రామ సభల్లో పాల్గొంటూ మహిళల అభ్యున్నతి, పసిపిల్లల ఆరోగ్య పరిరక్షణ లాంటి పనులను చేపడుతున్నాం. పనికి తగిన వేతనం ఇవ్వాలని చేస్తున్న ఆందోళనలకు ఫలితం రావడం లేదు.

– సుగుణాబాయ్, అంగన్‌వాడీ టీచర్ల మండల అధ్యక్షురాలు, వీపనగండ్ల

త్వరలోనే ఖాళీల భర్తీ

గ్రామాల్లో ఏర్పడ్డ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీలను వెంటనే భర్తీ చేసేందుకు అవసరమైన నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం. మే నెలలో సెలవులపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి. ఎన్నికల విధులను తప్పకుండా నిర్వహించాలి. కేంద్రాల సమస్యల పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మమ్మ, సీడీపీఓ, పెబ్బేరు ప్రాజెక్ట్

రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం తప్పదు



అమరచింత: దేశంలో రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు కోసం ప్రతి ఒక్కరూ మతోన్మాద బీజేపీని ఓడించడంతోపాటు కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను ఎంపీలుగా గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు కోరారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో మండలంలోని కొంకన్‌వానిపల్లిలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా విజయరాములు మాట్లాడుతూ బీజేపీతో ప్రజాస్వామ్యానికి, లౌకిక వ్యవస్థకు ముప్పుపొంచి ఉందన్నారు. నరేంద్రమోదీ హిందూ, ముస్లిం మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, మోషా, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, లక్ష్మీనారాయణ శెట్టి, మల్లేష్, వెంకటేష్, అంజి పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

కొత్తకోట రూరల్: కాంగ్రెస్ బలోపేతానికి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి గెలుపు కోసం కృషి చేస్తామని యూత్ కాంగ్రెస్ వనపర్తి నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పెద్దగాని నరేష్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నియమించిన టీపీసీసీ యూత్ అధ్యక్షుడు శివసేనారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గత పదేళ్ల కాలంగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని దుయ్యబట్టారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి యాదగిరిగౌడ్, మున్నూరు జయకర్ పాల్గొన్నారు.

అమలు కాని హామీలతో గద్దెనెక్కారు



సల్కెలాపురంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: ఐదు నెలల క్రితం గ్రామాలకు వచ్చి అత్తకు రూ.4 వేలు, కోడలికి రూ.2,500 ఇస్తాం అని అబద్ధాలు చెప్పిన కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సల్కెలాపురం, మానాజీపేట గ్రామాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ సీమాంధ్ర నాయకులతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన హయాంలోనే మన ప్రాంతంలో 11 నెలల సమయంలోనే కాల్వలు తవ్వి గ్రామాల్లోని చెరువులు, వాగుల గుండా సాగునీరు పారించిన ఘనత ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, వెంకటయ్య, విజయేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, భాగన్న తదితరులు పాల్గొన్నారు.



వడ్డెవాట శివారులో మాట్లాడుతున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట రూరల్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని వడ్డెవాట, ఈదుబావితండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భీసం చెన్నకేశవర్డి, గాడీల ప్రశాంత్, వెంకటేశ్వర్‌రెడ్డి, కిషన్‌నాయక్, లక్ష్మీకాంత్‌రెడ్డి, రవి, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: కాంగ్రెస్ గ్యారంటీలు లేని హామీలతో, మతోన్మాద బీజేపీతో రాష్ట్ర ప్రజలకు నష్టమే మిగిలిందని ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మాజీఎంపీపీ శ్రీధర్‌గౌడ్, వైస్‌ఎంపీపీ కోటేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశ చరిత్రలోనే రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, డబుల్‌బెడ్రూం ఇళ్లు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ ఏకమైనా పాలమూరులో బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిదే గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మండ్లరామకృష్ణ, మాసన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని వారు అభ్యర్థించారు. కార్యక్రమంలో డా.తిరుపతయ్య, తిరుపతి యాదవ్, ప్రభాకర్, చంద్రయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీని ఆదరించండి

చిన్నంబావి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆదరించాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆయన మండలంలోని కొప్పునూరు, బెక్కెం గ్రామాల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అరాచక పాలన ప్రారంభమయిందని, ఎన్నికల్లో గెలిచిన వెంటనే చిన్నంబావి మండలంలో ప్రభుత్వ అధీనంలో నడిచే గోదాంలో దాదాపుగా రూ.30కోట్ల విలువైన వరి ధాన్యం చోరీకి గురైనా.. పోలీసులు నామమాత్రంగా కేసును విచారించారని ఆరోపిచారు. అవసరం అయితే ఇదే కేసు విషయంపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ, శ్రీధర్‌రెడ్డి, రాజురెడ్డి, వెంకటేష్, శరత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జయగౌడ్, ఖాదర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కొత్తకోట రూరల్: కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డిని వాల్మీకి బోయ ఐక్య కార్యచరణ కమిటీ రాష్ట్ర నాయకుడు భీమన్న నాయుడు కలిసి వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగంలో భాగంగా వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ సానుకూలంగా ఉందన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన కేంద్రం నుంచి అనుమతులు రావాల్సిందే అని సీఎం అన్నారు.

పట్టుదలతో లక్ష్యం చేరుకోవాలి

పెబ్బేరు రూరల్: పట్టుదలతో చదువుకొని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం వనపర్తి పట్టణానికి చెందిన మహమ్మద్ నిరంజన్ కుమార్తె సానియా ఇంటర్ ఒకేషనల్ కోర్సు ఫలితాలలో 960 మార్కులు సాధించి టాప్ ర్యాంక్‌లో నిలిచారు. శనివారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నివాసంలో ఆయన సానియాను అభినందించి శాలువాతో సన్మానించారు. ఆమె భవిష్యత్‌లో ఎంచుకున్న రంగాన్ని చేరుకోవాలంటే కృషి, పట్టుదల అవసరమని, శ్రద్ధ పెట్టి చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఉన్నత చదువుల్లో రాణించాలి



అమరచింత: పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించిన విద్యార్థిని నుజాహత్‌ను శనివారం టీపీసీసీ అధికార ప్రతినిధి శేశం నాగరాజ్‌గౌడ్ శాలువాతో సన్మానించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ విద్యలో రాణించి అనుకున్న లక్ష్యాన్ని సాధించి తన తల్లిదండ్రులతో పాటు పట్టణానికి మంచి పేరు, ప్రతిష్టతలు తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లిందని, ప్రభుత్వ కళాశాలలు, గురుకులాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, అరుణ్ కుమార్, పోసిరిగారి విష్ణు, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశ రక్షణ కోసం బీజేపీని గెలిపించాలి



మూలమళ్లలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



అమరచింతలో.. రంగాపురంలో..

ఆత్మకూర్: ప్రధానమంత్రి మోదీతోనే దేశ రక్షణ, అభివృద్ధి సాధ్యమని పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు గెలిపించాలని నాయకులు అన్నారు. శనివారం ఆత్మకూర్‌తో పాటు మండలంలోని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పుర ఫ్లోర్‌లీడర్ అశ్విన్ కుమార్, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్, అనిల్‌గౌడ్, మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు ఓటు వేసి గెలిపించాలని బీజేపీ నాయకులు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజుతో పాటు స్థానిక బీజేపీ నాయకులు కరపత్రాలను పంచి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నరాల నారాయణ, వెంకటేశ్వర్లు, మరాఠి అశోక్, భీంరెడ్డి, క్యామ భాస్కర్, హరీష్, మల్లారెడ్డి అనిల్, అంజి, రవి, వెంకటేష్ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ గెలుపు కోసం మండలంలోని రంగాపురం, సూగూరు గ్రామంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు భగవంతుయాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి పోతుగంటి భరత్ ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగరాజుయాదవ్, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాములు, నాయకులు మురళీధరచారి తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: బీజేపీ అధికారంలోకి వస్తేనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అక్కాల రామన్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అమలు కాని హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం నేర్పాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాకేష్‌యాదవ్, నారాయణ, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బహుజనులకు మేలు



ప్రచారం చేస్తున్న బీఎస్పీ నాయకులు

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఎస్పీ అభ్యర్థి బీసమోళ్ల ఏసేపు గెలుపు కోసం శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురంలో బీఎస్పీ మండల ఉపాధ్యక్షుడు గుడిసె ధర్మ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ తిరుగుతూ ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రక్షణ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న బహుజన సమాజ్ పార్టీని భారీ మెజారిటీ గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు అశోక్‌సామ్రాట్, దేవదాసు, పవన్, రాము, స్వామి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వేసవి యోగా శిబిరం ప్రారంభం



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

వనపర్తి టౌన్: వేసవి యోగా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడాల అధికారి సుధీర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా యోగాసన క్రీడా సంఘం ఆధ్వర్యంలో వేసవి యోగా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలని, అభ్యాసం మెదడుకు పదును పెట్టి కొత్తకొత్త ఆలోచనలు ఇచ్చేందుకు దోహదపడుతుందన్నారు. యోగాతో మంచి క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవాటు పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుగుణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రేమలత, గణేష్, గోవింద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం'



శేరుపల్లిలో ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి: ప్రజల నుంచి వచ్చే స్పందన చూస్తుంటే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని హనుమాన్ టేకిడీ, పాత యూకోబ్యాంక్‌కాలని, పాతకోట, గాంధీచౌక్ ప్రాంతాల్లో మార్నింగ్ వాక్ చేస్తూ డా. మల్లు రవిని గెలిపించాలని ప్రచారం చేశారు. ఇళ్లు, దుకాణాల వెంట తిరిగి ప్రచార కరపత్రాలను పంపిణీ చేస్తూ హస్తం గుర్తుకు ఓటేయాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పుట్టపాగ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, బి.శ్రీనివాస్‌గౌడ్, నాయకులు చందర్, పగిడాల శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీయే గెలుస్తుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా శనివారం సాయంత్రం ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి శ్రీరంగాపురం మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లి గ్రామంలో పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరిరాజు, బీరం రాజశేఖర్‌రెడ్డితదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు మేలు జరుగుతుందని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను, రామలక్ష్మారెడ్డి, శారద, ఎస్టీడీ శ్రీను ఉన్నారు.

అమరచింత: కాంగ్రెస్ పార్టీ బలపర్చిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలంటూ కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీలన్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, శ్యాం, వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ్, పోసిరిగారి విష్ణు, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవిని గెలిపించేందుకు ప్రతి ఒక్క ఓటరు సహకరించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, ఎంపీటీసీ సభ్యుడు ఇంద్రకంటి వెంకటేష్, మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య కోరారు. శనివారం బొల్లారం, కొర్లకుంట గ్రామాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించి మల్లురవిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కృష్ణయ్య, గోపాల్‌నాయక్, చక్రవెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

బిజినేపల్లి: నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన జ్యేష్ఠాదేవి సమేత శనేశ్వరునికి శనివారం తిలతైలాభిషేకం పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి భక్తులతో శనిదోష నివారణ మంత్రం ఉచ్ఛరింపజేశారు.